మూసాపేటలో మస్తు ట్రాఫిక్

10 సంవత్సరాలుగా ముందుకు సాగని రోడ్డు వెడల్పు పనులు

రోడ్డుకు ఇరువైపులా అక్రమ పార్కింగ్.. ఫుట్‌పాత్‌ల ఆక్రమణ

వాహనదారులు, పాదచారులకు తప్పని ఇబ్బందులు

మూసాపేట చౌరస్తా నుంచి మున్సిపల్ ఆఫీస్ వరకు వెళ్లాలంటే ట్రాఫిక్‌తో తిప్పలు తప్పడం లేదు. వాహనదారులతో పాటు స్థానిక ప్రజలు కూడా ట్రాఫిక్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకప్పుడు ఉద్యోగానికి వెళ్లే సమయంలోనే కొద్ది మేర ట్రాఫిక్‌తో అంతరాయం కలిగేది. ప్రస్తుతం ఏ సమయంలోనైనా భారీ ట్రాఫిక్‌తో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కూకట్‌పల్లిలోనే ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని తప్పించుకునేందుకు మూసాపేట చౌరస్తా నుంచి కైత్లాపూర్ మీదుగా హైటెక్ సిటీ, మాదాపూర్‌కు వెళ్లేవారు. ఇప్పుడు మూసాపేట అంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. మున్సిపల్ కార్యాలయానికి వివిధ శాఖల అధికారులు ఇదే రహదారిపై రాకపోకలు సాగిస్తారు. వారు కూడా ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారే. అయినా పరిష్కారానికి మొగ్గు చూపకపోవటంతో స్థానిక ప్రజలు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


మూసాపేటలో స్తంభించిన వాహనాల రాకపోకలు

మూసాపేట: రానున్న రోజుల్లో మరింత ట్రాఫిక్ సమస్య పెరుగుతుందనే మూసాపేట చౌరస్తా నుంచి ఆంజనేయ నగర్ చౌరస్తా వరకు 100 ఫీట్ల వెడల్పుతో రోడ్డు విస్తరణ పనులు పది సంవత్సరాల క్రితం ప్రారంభమయ్యాయి. చౌరస్తా నుంచి రోడ్డుకు ఆనుకుని ఉన్న షాపులు, భవన యజమానులకు పరిహారం చెల్లించి కొన్నింటిని తొలగించారు. మరికొన్ని తొలగించాల్సి ఉంది. వాటిని తొలగించకపోవటంతో రోడ్డు విస్తరణ పనులు ఆగిపోయాయి. దీంతో రోజు రోజుకు ట్రాఫిక్ సమస్య తీవ్రతరమవుతున్నది. ఈ దారి వెంటనే హైటెక్ సిటీ, మాదాపూర్ వంటి ఐటీ ప్రాంతాలకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇందుకు అనుగుణంగానే కైత్లాపూర్ వద్ద అయ్యప్ప సొసైటీకి వెళ్లే దారిలో నూతనంగా బ్రిడ్జి నిర్మించారు. హైటెక్ సిటీ షైటవర్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ డైవర్షన్‌లు, రోడ్డు విస్తరణ పనులు చేశారు. కానీ మూసాపేట చౌరస్తా వద్ద రోడ్డు విస్తరణ పనులను మాత్రం గాలికొదిలేశారు. భవన యజమానులతో మాట్లాడి వాటిని తొలగించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ఆక్రమణల వల్లే మరింత ట్రాఫిక్!

100 అడుగుల రోడ్డు విస్తరణ జరిగిన తర్వాత ఫుట్‌పాత్ నిర్మించాల్సి ఉంటుంది. కానీ రోడ్డు విస్తరణ పనులు సంవత్సరాలు గడిచినా జరుగకపోవడంతో సుమారు కోటిన్నర రూపాయలతో ఫుట్‌పాత్‌ను నిర్మించారు. వాటిపై పాదచారులు నడిచేందుకు రెయిలింగ్ కూడా ఏర్పాటు చేశారు. కొన్ని రోజులకు రెయిలింగ్‌ను తొలగించారు. దీంతో చిరువ్యాపారులు ఫుట్‌పాత్‌పై తమ సామగ్రితో రోడ్డుపై షాపులను ఏర్పాటు చేసుకున్నారు. ఆయా చిరువ్యాపారుల వద్దకు వచ్చే వినియోగదారులు ఇంకా రోడ్డుపైకి వాహనాలను నిలుపుతుండటంతో రాకపోకలు సాగించే వాహనాలకు అడ్డంకిగా ఏర్పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. మూసాపేట చౌరస్తా నుంచి ఆంజనేయ చౌరస్తా వరకు వివిధ పార్టీల నాయకులు కూడా పోటాపోటీగా షాపులను ఏర్పాటు చేశారు. సుమారు వందల కొద్దీ షాపులు ఉండటంతో ట్రాఫిక్ మరింత తీవ్రమవుతున్నది. అంతేకాకుండా రాత్రి సమయాల్లో వాహనాలను రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేస్తున్నారు. పార్కింగ్‌కే సగం రోడ్డు ఆక్రమించుకోవటంతో ట్రాఫిక్ ఇబ్బంది తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మూసాపేట రోడ్డును వెడల్పు చేసి ట్రాఫిక్ కష్టాలను తీర్చడమే కాక మూసాపేట అభివృద్ధికి తోడ్పాటునందించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కోర్టుకు వెళ్లడం వల్ల పనులు ఆగాయి

రోడ్డుకు అడ్డుగా ఉన్న భవనాల కూల్చివేతలు జరగాలి. టౌన్‌ప్లానింగ్ అధికారులు భవనాలు కూల్చివేస్తే రోడ్డు పనులు ప్రారంభమవుతాయి. కొందరు భవన యజమానులు భవనాల కూల్చివేతల విషయంలో కోర్టుకు కూడా వెళ్లారు. ఆ పనులు పూర్తి అయ్యాక రోడ్డు వెడల్పు పనులు జరుగుతాయి.

– మున్సిపల్ ఏఈ

గంటల కొద్దీ చిక్కుకోవల్సిందే..



ఒకప్పుడు ట్రాఫిక్ లేకుండా హైటెక్ సిటీకి వెళ్లాలంటే మూసాపేట గుర్తుకు వచ్చేది. కానీ ఇప్పుడు ఏదైనా పనికి మూసాపేటకు వెళ్లాలంటేనే ట్రాఫిక్‌తో భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. గంటల కొద్దీ సమయం వేచి చూడాల్సిందే. బయట నుంచి వచ్చే వాహనదారులే ఇబ్బందులు పడుతుంటే స్థానిక ప్రజలు ప్రతి రోజూ ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో.

– అనిల్, ప్రశాంత్‌నగర్ నివాసి

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ దుర్గా భవానీ మాతా దేవాలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం 8 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, యాగశాల ప్రవేశం, అవాహిత దేవతా హోమాలు, మూల మంత్ర హోమాలు, జలాధివాసం, నీరాజనం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. శుక్రవారం మండపారాధన, అవాహిత దేవతా హోమాలు, చండీహోమం తదితర కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

రేపు ఆలయంలో ప్రత్యేక పూజలు

మోతీనగర్: మూసాపేట డివిజన్ కబీర్‌నగర్, అవంతినగర్, మోతీనగర్ ఎక్స్‌టెన్షన్‌లో శివరామాంజనేయ స్వామి దేవాలయంలో శనివారం పౌర్ణమి, దత్త జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తారు. అదే విధంగా పౌర్ణమి సందర్భంగా ఆలయంలోని ఉప ఆలయాల్లో కూడా పూజలు నిర్వహిస్తారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొనే దంపతులు గోత్ర నామాలను నమోదు చేయించుకోవాలని కోరారు.

రోడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి


మాట్లాడుతున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: రోడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, ఆ వైపుగా అధికారులు కృషి చేయాలని కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. గురువారం అల్లాపూర్ వార్డు కార్యాలయంలో పారిశుద్ధ్య విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ సురేష్, ఎస్ఎఫ్ఏ అరుణ్ నరేంద్ర, నరసింహ, జవాన్, కృష్ణయ్య పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పగుడాల శిరీష

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని శ్రీహరినగర్‌లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయని, సమయానికి వాటర్ క్యూరింగ్ చేసి సాధ్యమైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో శ్రీహరినగర్ కాలనీ ప్రెసిడెంట్ జయరాజ్, భాస్కర్‌రావు, సుశీల్, శారద తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి మహాపడి పూజలు



ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి వెంకట్‌రావు నగర్ కాలనీ రోడ్డు నెంబర్ 8లో అంకెన్‌పల్లి హరీష్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మహా పడిపూజను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వరరావు గురుస్వామి హాజరయ్యారు. పూజ అనంతరం గురుస్వాములను సన్మానించారు.

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ ఆటోస్టాండ్ వద్ద వెంకటరమణ గురుస్వామి అయ్యప్ప స్వామి పడిపూజను గురువారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వల్లభ్‌నగర్‌లో..



ఓల్డ్‌బోయిన్‌పల్లి: హరిహరపుత్రుడు అయ్యప్పస్వామి పడి పూజను గురువారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ వల్లభ్‌నగర్‌లో ఘనంగా జరిగింది. శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ మహాపడి పూజ కన్నుల పండగగా సాగింది. అయ్యప్ప స్వాముల భక్తిగీతాలతో ఆ ప్రాంతమంతా మారుమ్రోగింది. కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్‌గౌడ్, పవన్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

PUBLIC NOTICE

All the general public are hereby informed that, our client M/s Scoat Pharma Private Limited rep by its Director Sri J. Anil Kumar Gupta Gajularamaram Village, Quthbullapur Mandal, Rangareddy District filed the suit in O.S.No.08/2020 on the file of Hon'ble III Addl. District and Sessions Judge-cum-II Addl. MSJ-cum-PRL Family Judge, Medchal-Malkajgiri District at kukatpally for recover of amount of Rs. 1,77,90,850/- against the M/s Sucharitha Power Systems Rep by its Proprietor, Smt. N. Shoba and another. Our client M/s Scoat Pharam doing manufacturing of Pharmaceuticals in the premises bearing Plot No.54, admeasuring 350Sq.yds., in Sy.no.342 consisting of three floors of ALEAP Industrial Estate situated at Gajularamam Village, Quthbullapur Mandal, Rangareddy District. That the said owner of the property M/s Sucharitha Power Systems rep by its Proprietor Smt. N. Shoba trying to alienate the property in favour of third parties without disclosing the loan obtained from our client client taking necessary steps to protect his interest in the said suit claim. In the meantime, the General Public is hereby cautioned not to deal with the said property.

M/s B. MOHAN & ASSOCIATES
ADVOCATES
Office:-MIG-59, Nandanavanam Colony,
Bathkammakunta, Bagh Amberpet, Hyderabad-13
Cell# 9948077678 Email: bukm03mohan@gmail.com

అక్రమ నిర్మాణం తొలగించాలని వినతి


డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అపార్ట్‌మెంట్ వాసులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్‌కు చెందిన వీఎస్ఆర్ హైట్స్ అపార్ట్‌మెంట్ పక్క స్థలంలో పర్వత్‌నగర్‌కు చెందిన కళ్యాణ్‌నాయక్ అపార్ట్‌మెంట్‌కు ఆనుకుని అక్రమ నిర్మాణం చేపడుతున్నాడు. దీంతో గురువారం అపార్ట్‌మెంట్ వాసులు డిప్యూటీ కమిషనర్ వంశీకృష్ణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణం వల్ల తమ గోడలు పాడవడంతో తాము హైకోర్టుకు వెళ్లామని, కోర్టు వారు నిర్మాణాన్ని నిలిపి వేయాలని, అప్పటి వరకు జరిగిన కట్టడాన్ని తొలగించాలని నోటీసు ఇచ్చారని తెలిపారు. కానీ కళ్యాణ్ నాయక్ స్థానిక ప్రజా ప్రతినిధుల అండదండలతో తన అక్రమ నిర్మాణాన్ని కొనసాగిస్తున్నారని వివరించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమ నిర్మాణంపై కఠిన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు.

పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని వివిధ కాలనీల్లో ఏర్పడిన మంచినీటి పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. జలమండలి డీజీఎం నాగప్రియ, మేనేజర్ ఝాన్సీలకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో ఈస్ట్ సాయినగర్, వెస్ట్ సాయినగర్, ఫేజ్ టు, ఎల్లమ్మబండ, పీజేఆర్ నగర్ కాలనీ, మహంకాళినగర్ కాలనీల్లో మంచినీటి పైపులైన్ లీకేజీతో మురుగునీరు చేరి మంచినీరు కూడా కలుషితమవుతుందని వివరించారు. నెలలు గడుస్తున్నా సంబంధిత అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కమలాకర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, కేశవరావు, ఎత్తరి రమేష్, సురేష్, అమర్‌నాథ్, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి అరుదైన శస్త్రచికిత్స



మాదాపూర్: చిన్నారికి అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలను కాపాడారు మెడికవర్ ఆస్పత్రి డాక్టర్లు. మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో గురువారం మెదులో బ్లాస్టోమా బ్రెయిన్ ట్యూమర్ సర్జరీకి సంబంధించి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పైన్ సర్జన్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ అక్షర (12) తరగతి గదిలో తరచు నిద్రపోవడం గమనించిన టీచర్లు తల్లిదండ్రులకు విషయాన్ని తెలియజేశారు. వారు మెడికవర్ ఆసుపత్రి వైద్యులను సంప్రదించగా.. అక్షరకు మెదడులో ట్యూమర్ ఉన్నట్టు గుర్తించారు. క్లిష్టమైనదిగా ఉండడం వల్ల ఆపరేషన్‌లో పక్షవాతం, ప్రాణాపాయం వంటి సమస్యలు ఉంటాయన్నారు. డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి మొదట ట్యూమర్‌ని తొలగించారు. ఆపరేషన్ తరువాత హైడ్రోసెఫలస్ అనే సమస్యకు గురవడంతో వెంట్రికులో పెరిటోనియల్ షంట్ కోసం రెండో సర్జరీ చేయాల్సి వచ్చిందన్నారు. అనంతరం మూడు నెలల పాటు కోమాలోకి వెళ్లింది. చికిత్స అనంతరం కోమానుంచి బయటి పడింది. కార్యక్రమంలో డాక్టర్ నిత్య పాలపాటి ,సిబ్బంది పాల్గొన్నారు.

శభాష్ పోలీస్



సుభాష్‌నగర్ : జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు విధులతోపాటు ఇతరుల పట్ల సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నారు. విధులు నిర్వహిస్తున్న సమయంలో వాహనదారులకు, పాదచారులకు ఏ చిన్న సమస్య వచ్చినా స్నేహభావంతో పనిచేసే ఫ్రెండ్లీ పోలీస్‌గా ముందుకు వెళ్తున్నారు. చింతల్ ప్రధానదారి హ్యాపీ చిల్డ్రన్ హాస్పిటల్ వద్ద దివ్యాంగుడిని జీడిమెట్ల హైడ్రా ట్రాఫిక్ వాలంటీర్ రోడ్డు దాటిస్తుండగా సాక్షి కెమెరాకు చిక్కింది. ఇటీవల గ్రూప్–3 పరీక్షల్లో ఓ విద్యార్థిని అడ్రస్ తప్పిపోయి రాగా.. ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ 3 నిమిషాల్లో 3 కిలో మీటర్లు తీసుకెళ్లి పరీక్ష కేంద్రానికి చేర్చారు. అదేవిధంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించడంపై జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులపై ప్రశంసల జల్లులు కురిపిస్తున్నారు.

రేపు 'టీహబ్'లో హెల్త్ కేర్ సమ్మిట్

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జిసిటీలోని 'టీహబ్'లో శనివారం ఉదయం 9గంటలకు నాల్గవ హెల్త్ కేర్ సమ్మిట్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ' హైప్ వర్సెస్ రియాలిటీ: న్యూ జెన్ టెక్నాలజీ ఇన్ హెల్త్ కేర్ డెలివరీ' అనే అంశంపై ప్రత్యేక చర్చా కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్, ఏఐజీ ఆస్పత్రుల డైరెక్టర్ డాక్టర్ జీవీరావు, డాక్టర్ వి మోహన్, పలువురు వైద్యులు పాల్గొంటారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది. కార్యక్రమంలో భాగంగా 'లెర్న్ 5 థింగ్స్ టు కీప్ అండ్ 5 థింగ్స్ టు త్రో అవే' అనే అంశంపై లండన్‌కు చెందిన విద్యావేత్త, జిమ్‌ర్యాన్ ఉపన్యాసమిస్తారు.

సమ్రీన్ కౌసర్‌కు పీహెచ్‌డీ



రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో రసాయనశాస్త్ర పరిశోధక విద్యార్థిని సమ్రీన్ కౌసర్‌కు గురువారం పీహెచ్‌డీ ప్రకటించారు. స్కూల్ ఆఫ్ సైన్సెస్‌లోని కెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఖాసిమ్‌ఉల్లా పర్యవేక్షణలో 'బయోలాజికల్ యాక్టివ్ మాలిక్యూల్స్ మెథడాలజీస్' అంశంపై థీసిస్‌ను సమర్పించారు.

సోమ రాజన్నకు ఘన నివాళి

మియాపూర్: కష్టజీవుల పక్షాన రాజీలేని పోరాటం చేసిన నాయకుడు అమరజీవి కామ్రేడ్ సోమ రాజన్న అని ఎంసీపీఐయూ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి మైదంశెట్టి రమేష్ అన్నారు. మియాపూర్ స్టాలిన్ నగర్‌లో గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో సోమ రాజన్న వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పీడిత ప్రజల పక్షాన పలు పోరాటాలు చేసిన నేత సోమరాజన్న అని అన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ సహాయ కార్యదర్శి తుడుం అనిల్ కుమార్, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి వర్గ సభ్యులు తాండ్ర కళావతి, ఇస్లావత్ దశరథ్ నాయక్, కమిటీ సభ్యులు పి. భాగ్యమ్మ, ఎం. రాణి, తుడుం పుష్పలత, సభ్యులు పాల్గొన్నారు.

ధర్నాకు తరలిన అంగన్‌వాడీలు



బాలానగర్: చలో ఇందిరాపార్కు ధర్నాకు హస్మత్‌పేట, ఎర్రగడ్డ, మూసాపేట, పర్వత్ నగర్‌లలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు గురువారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్, యూనియన్ నాయకురాలు వసంతలక్ష్మి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం టీచర్‌కు రూ.18 వేలు, హెల్పర్‌కి రూ.12 వేలు వెంటనే ఇవ్వాలన్నారు. 11 నెలల అద్దెలు, కూరగాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సారిక, శ్వేత, రజిత, హేమ, రమ, సంగీత, శశికళ, శారద, పద్మ, శాలిని, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్, ఖోఖో జట్లను అభినందించిన ఇన్‌చార్జి వీసీ


ఖోఖో క్రీడాకారులను అభినందిస్తున్న ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

కేపీహెచ్‌బీకాలనీ: అనురాగ్ యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఇంటర్ ఇంజనీరింగ్ హ్యాండ్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్న పురుషుల జట్టు ప్రథమ స్థానం సాధించింది. అదే విధంగా శ్రీనిధి ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన ఇంటర్ కాలేజ్ నేషనల్ లెవెల్ ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీల్లో జేఎన్‌టీయూహెచ్ పురుషుల జట్టు కూడా ప్రథమ స్థానం సాధించింది. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన రెండు జట్లను ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి గురువారం అభినందించారు. యూనివర్సిటీలో క్రీడల ప్రోత్సాహానికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ ప్రొఫెసర్ దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ నల్లగొండ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధిఖీనగర్‌లో 6 భవనాలు సీజ్

20 మంది యజమానులకు నోటీసులు జారీ

గచ్చిబౌలి: సిద్ధిఖీనగర్‌లో అక్రమ నిర్మాణాల సీజ్ ప్రక్రియ మొదలైంది. గత కొద్ది రోజులుగా అక్రమ నిర్మాణాల లెక్కలు తేల్చేందుకు శేరిలింగంపల్లి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు సర్వే చేపట్టారు. ఈ క్రమంలో పోలీసు బందోబస్తు మధ్య గురువారం ఆరు భవనాలను సీజ్ చేశారు. దీంతో అక్రమ నిర్మాణదారులకు ముచ్చెమటలు పడుతున్నాయి.



భవనం ఒరిగిన ఘటనపై..

సిద్ధిఖీనగర్‌లో ప్లాట్ నంబర్ 1639లో 50 చదరపు గజాల స్థలంలో జీ ప్లస్ ఫోర్ భవనం నిర్మించారు. నవంబర్ 19న ఆ భవనం పక్కకు ఒరగడంతో నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రమాదకరంగా ఉండటంతో జీహెచ్ఎంసీ ఉన్నతాధికారుల ఆదేశాలతో భవనాన్ని కూల్చివేశారు. ఈ క్రమంలోనే అధికారుల ఆదేశాలతో అక్రమ నిర్మాణాలను గుర్తించారు. శేరిలింగంపల్లి సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ వెంకటరమణ ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. అండర్ సెక్షన్ 451–ఏ ఆఫ్ జీహెచ్ఎంసీ యాక్ట్ 1955 ప్రకారం అక్రమ నిర్మాణాలను సీజ్ చేస్తున్నటు ఏసీపీ తెలిపారు. ఇప్పటికే 20 భవనాల యజమానులకు నోటీసులు జారీ చేశామని, మరి కొంతమందికి నోటీసులు ఇవ్వాల్సి ఉందన్నారు. సిద్ధిఖీనగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనాలకు నోటీసులు ఇచ్చి సీజ్ చేస్తామని ఆయన స్పష్టం చేశారు.





సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462